నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 8 జూలై 2024 | SIDDIPET

పూజలు అందుకుంటున్న వనదుర్గమ్మ

శాకాంబరిగా ఏడుపాయల దుర్గమ్మ

పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

పాపన్నపేట, జూలై 7 : ఆషాఢమాసం మొదటి ఆదివారాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లాలోని ఏడుపాయల వన దుర్గాభవానీ మాతను శాకాంబరి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం వేకువజాము నుంచే ఏడుపాయలకు భక్తులు తరలిరావడంతో జాతరను తలపించింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలానీలాలు, బోనా లు సమర్పించి మొక్కుకున్నారు. ఆలయ చైర్మన్ సతెల్లి బాలగౌడ, ఈవో కృష్ణప్రసాద్, సిబ్బంది రవివీర్‌కుమార్, సూర్యశ్రీనివాస్ ,మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వరుణాచారి, రాజు, యాదగిరి, శ్రీకాంత్ భక్తులకు సేవలందించారు. వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ ప్రత్యేక పూజాలు నిర్వహించారు. పాపన్నపేట్ ఎస్సై నరేశ్ తన సిబ్బందితో కలిసి బందోబస్తు విధులు నిర్వర్తించారు.

క్యూలైన్‌లో రద్దీ

డాక్టర్ కిషన్‌రావుకు జాతీయ అవార్డు ప్రదానం

పటాన్‌చెరు, జూలై 7: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ కిషన్‌రావుకు 'పౌర సంస్థ క్యాపిటల్ ఫౌండేషన్, సొసైటీ ఎర్త్‌కేర్ ఎన్విరాన్‌మెంట్' జాతీయ అవార్డును ప్రకటించింది. ఆదివారం రాత్రి శామీర్‌పేట్‌లోని నల్సార్ వర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా వెంకటరమణి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అవార్డు అందజేశారు. కిషన్‌రావు అనారోగ్యంతో ఉండటంతో ఆయన కుటుంబసభ్యులు అల్లాని రఘునాథరావు, వైష్ణవి అవార్డు, జ్ఞాపికను వేదికపై స్వీకరించారు. ఈ సందర్భంగా వక్తలు కిషన్‌రావు సేవలను కొనియాడారు. ఫార్మా పరిశ్రమల ద్వారా వస్తున్న కాలుష్యంతో ఏర్పడుతున్న సమస్యలపై ఆయన రాజీలేని పోరాటం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు, హరిత ట్రిబ్యునల్‌లో ఆయ న అనేక కేసులు వేసి కాలుష్య సమస్యపై న్యాయం కోరారన్నారు. పటాన్‌చెరు మండలం నందిగామ లో నివసిస్తున్న డాక్టర్ కిషన్‌రావు కాలుష్య కారక పరిశ్రమలపై సుధీర్ఘకాలం న్యాయ పోరాటం చేశారు. పటాన్‌చెరు ప్రాంతంలోని 18 గ్రామాల్లో పూర్తిస్థాయిలో జలాలు కలుషితం అయ్యాయని ఆయన

జాతీయ అవార్డుతో డాక్టర్ కిషన్‌రావు దంపతులు

వేసిన కేసులో సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ అందరికీ ఉచితంగా తాగునీరు ఇవ్వాలని తీర్పులో ప్రభుత్వాన్ని ఆదేశించాయి.ఆ తీర్పు ప్ర కారమే 18 గ్రామాలకు నేటికి ఉచితంగా తాగునీ రు లభిస్తున్నది. కిషన్‌రావు నందిగామలో గోశాల ఏర్పాటు చేసి విశ్రాంత జీవితం గడుపుతున్నారు.

ఘనంగా బురుజు మైసమ్మ బోనాలు

అమ్మవారినికి దర్శించుకుంటున్న భక్తులు, బోనాల ఊరేగింపు

సిద్దిపేట టౌన్, జూలై 7 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది.ఆషాడ మాసం మొదటి వారంలో సిద్దిపేట బురుజు మైసమ్మకు భక్తులు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.అందులో భాగంగా బోనాల మనోత్సవాన్ని ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి బొట్టు, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జోగిని భవిష్యవాణి వినిపించింది. అంతకు ముందు డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్ దీప్తీ నాగరాజులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ వారు భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

108 సూర్య నమస్కారాల సాధన

కోమటి చెరువు రూబి నెక్లెస్‌రోడ్ పై సూర్య నమస్కారాల సాధన చేస్తున్న యోగా సాధకులు

సిద్దిపేట, జూలై 7: వ్యాస మహర్షి యోగా సొసైటీ, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు రూబీ నెక్లెస్‌రోడ్‌లో యోగాగురువు తోట సతీశ్ ఆధ్వర్యంలో 108 సామూహిక సూర్య నమస్కారాల సాధన నిర్వహించారు.యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అంజయ్య, సంధ్య, శ్రీనివాస్, రాములు, సురేశ్, బసవరాజ్, భరత్, వేణు, ఆనంద్, వనమాల, సాయి తేజ, చందన, మంజుల పాల్గొన్నారు.

మట్టి స్నానంతో ఆరోగ్యం

సిద్దిపేట, జూలై 7: మట్టి స్నానం చేయడం వల్ల అధిక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయ ని యోగా గురువు వంశీ కృష్ణ అన్నారు. ఆదివారం ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వయ్యాల గార్డెన్‌లో యోగా గురువులు అశోక్ కృష్ణమూర్తి, పెద్దిమనోహర్ మట్టి స్నాన కార్యక్రమం నిర్వహించారు. ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సిద్ధిరాములు, వినోద్, కత్తుల బాపురెడ్డి, గురూ జీ, రవికుమార్, ప్రభుదాస్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్, దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నీళ్లు లేక బోసిపోయి కనిపిస్తున్న మల్లన్నసాగర్

అడుగంటిన ఆశలు

- డెడ్ స్టోరేజీకి చేరిన రిజర్వాయర్లు
- కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, పిచ్చిమొక్కలు
- ఎండిపోయిన చెరువులు
- గోదావరి జలాల తరలింపుపై దృష్టిసారించని సర్కారు
- పూడికతీతపై పట్టించుకోని యంత్రాంగం
- వానకాలం సాగుపై ఆందోళనలో రైతాంగం

సిద్దిపేట జిల్లాలో నీళ్లు లేక బోసిపోయిన రంగనాయక సాగర్

సిద్దిపేట, జూలై 07(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు డెడ్‌స్టోరేజీకి చేరాయి. ఈ రిజర్వాయర్లను గోదావరి జలాలతో నింపి చెరువులకు నీటిని విడుదల చేస్తే భూగర్భజలాలు పెరిగి గతేడాది తరహాలో పంటలు సాగుచేసుకోవచ్చని రైతులు ఆశపడుతున్నారు. ఇప్పటి వరకు భారీ వర్షాలు కురవక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు వేయగా అవి మట్టిలోనే వట్టిపోతున్నాయి. మరికొన్ని చోట్ల మొక్కలు ఎండి పోతున్నాయి. పెట్టిన పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరినాట్లు వేద్దామంటే నీళ్లులేక నార్లు ముదిరిపోతున్నదని రైతులు తెలుపుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో మండు టెండల్లో కాళేశ్వర జలాలను చెరువులకు విడుదల చేయడంతో నిండుకుండలా ఉండేవి. వర్షాకాలం ప్రారంభం కాగానే కొద్దిపాటి వర్షం కురిసినా చెరువులు నిండిపోయేవి. దీంతో సాగు నీటి ఇబ్బందులు ఎదురుకాలేదు. గత వేసవిలో కాళేశ్వర జలాలను విడుదల చేయక పోవడంతో సిద్దిపేట జిల్లాలో చెరువులు ఎండి భూగర్భ జలాలు అడుగంటాయి. ప్రస్తుతం జిల్లాలోని రిజర్వాయర్ల పరిస్థితి ఆశాజనంగా లేకపోవడంతో వానకాలం సాగుపై రైతుల్లో ఆశలు అడుగంటుతున్నాయి.

బోసిపోయిన రిజర్వాయర్లు

బీఆర్ఎస్ హయాంలో గోదావరి జలాలతో కళకళలాడిన రిజర్వాయర్లు నేడు నీళ్లు లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల సరిహద్దులోని అన్నపూర్ణ రిజర్వాయర్ సామర్థ్యం 3.5 టీఎంసీల కాగా, ప్రస్తుతం ఇందులో 0.73 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రానికి అనుకుని ఉన్న రంగనాయకసాగర్ రిజర్వాయర్ సామర్థ్యం 3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 0.69 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. తోగుట మండలంలోని మల్లన్నసాగర రిజర్వాయర్ సామర్థ్యం 50 టీఎంసీలు కాగా, ఇందులో ప్రస్తుతం 8. 849 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి.మర్కూక్ మండలంలోని కొండ పోచమ్మ రిజర్వాయర్ సామర్థ్యం 15 టీఎంసీలు కాగా, ఇందులో ప్రస్తుత నీటి మట్టం 4.75 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలోని ప్రధాన మధ్యతరహా శనిగరం ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.092 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అందులో 0.463 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో అన్ని రిజర్వాయర్లు నిం డుగా ఉండి అవసరాన్ని బట్టి చెరువులకు నీటిని విడుదల చేసేలా బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి జలాలతో నింపి పెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో అన్నదాతకు కష్టకాలం దాపురించింది.

కాల్వల్లో పేరుకపోయిన మట్టి, పిచ్చిమొక్కలు

సిద్దిపేట జిల్లాలోని ప్రధాన కాల్వలతో పాటు మైనర్ కాల్వల్లో మట్టి, పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగి పోయాయి. కనీసం కాల్వలను క్లీన్ చేద్దామనే ఆలోచన కూడా ప్రభుత్వానికి రావడం లేదు. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. వర్షాలు పడితే కాల్వల ద్వారా నీళ్లు ఎట్లా పోతాయి అనే ఆలోచన వారికి రావడం లేదు. ఇటీవల సిద్దిపేట జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఈ విషయమై ప్రధాన అంశంగా చర్చించారు. వెంటనే కాల్వలో పూడికతీత పనులు పూర్తి చేయాలని సూచించారు. పిచ్చి మొక్కలను తొలిగించాలని నీటి పారుదల శాఖ అధికారులను కోరారు. ఈ అంశంపై ప్రత్యేకంగా నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మను చౌదరిని కోరారు. కానీ, ఆ దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. కాల్వలు మట్టితో పూడుకపోయి కనిపిస్తున్నాయి.

పిచ్చిమొక్కలతో కాల్వలు

సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లు

క్ర.	రిజర్వాయర్ పేరు	సామర్థ్యం	ప్రస్తుత నీటి నిల్వ
1.	అన్నపూర్ణ	3.5 టీఎంసీలు	0.73 టీఎంసీలు
2.	రంగనాయక సాగర్	3.00 టీఎంసీలు	0. 69 టీఎంసీలు
3.	మల్లన్నసాగర్	50. 00 టీఎంసీలు	8. 849 టీఎంసీలు
4.	కొండపోచమ్మ	15.00 టీఎంసీలు	4.75 టీఎంసీలు
5.	శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు	1.092 టీఎంసీలు	0.463 టీఎంసీలు

నీళ్లు లేక బీడు భూములు

నిర్లక్ష్యం నీడన బొటానికల్ గార్డెన్

- కూలిన బోర్డు
- పట్టించుకోని అధికారులు

ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

రంగనాయక సాగర్ వద్ద ఏర్పాటుచేసిన బొటానికల్ గార్డెన్లో ఏపుగా పెరిగిన గడ్డి పిచ్చి మొక్కలు

సిద్దిపేట, జూలై 7: హరితహారంలో భాగంగా సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని రంగనాయక సాగర్ వద్ద ఏర్పాటుచేసిన బొటానికల్ గార్డెన్ నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. రంగనాయక సాగర్ వద్ద స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా తేజోవనం, బొటానికల్ గార్డెన్ పేరిట రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో 5000 మొక్కలను అటవీ శాఖ ఆధ్వర్యంలో గతేడాది ఆగస్టు 26న అప్పటి మంత్రి హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, విద్యార్థులు కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఈ గార్డెన్ సంరక్షణ బాధ్యతను సిద్దిపేట మున్సిపాలిటీకి అప్పగించారు. ప్రస్తుతం బొటానికల్ గార్డెన్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గార్డెన్‌లో మొక్కల కంటే పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. కనీసం గార్డెన్‌లో కలుపు తీయడం లేదు. ఒకవైపు గడ్డి.. మరోవైపు పిచ్చి మొక్కలతో బొటానికల్ గార్డెన్ కళావిహీనంగా తయారైంది.

కూలిపోయిన బొటానికల్ గార్డెన్ బోర్డు

వారం రోజుల్లో క్లీన్ చేస్తాం..

సిద్దిపేట రంగనాయక సాగర్ వద్ద బొటానికల్ గార్డెన్‌తో పాటు మియా వాకీలో కలుపు తీసే పనులు, పిచ్చిమొక్కల తొలిగించే పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా లేబర్‌ను ఏర్పాటు చేశాం. వారం రోజుల్లోగా కలుపు తీసే పనులు పూర్తిచేస్తాం. గాలి వానకు కూలిన బొటానికల్ గార్డెన్ బోర్డు ను తిరిగి ఏర్పా టు చేస్తాం.

-ప్రసన్నరాణి, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన బోర్డు కూలిపోయింది. దానిని పట్టించుకోవడం లేదు. ప్రస్తు తం బొటానికల్ గార్డెన్‌ను చూసి ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనుల పండువగా పూరీ జగన్నాథుడి రథయాత్ర

బొల్లారంలో పూరి జగన్నాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్పర్సన్ రోజా బాల్‌రెడ్డి దంపతులు

బొల్లారం, జూలై 7 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ పూరి జగన్నాథ్ ఆలయంలో జగన్నాథుడి దివ్యమంగళ రథోత్సవాన్ని ఆదివారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథయాత్రలో పాల్గొన్న భక్తులకు ఎంపీ చేతుల మీదుగా అన్నదాన వితరణ చేశారు. అంతకు ముందు మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూరీ జగన్నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశేష భక్తజనం రథాన్ని లాగారు.రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి మరమ్మతులు జరిగేనా..

లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 7: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్ ఆరోగ్య కేంద్రంలో మరమ్మతుల పనుల్లో పురోగతి కనిపించడం లేదు. 24గంటల పాటు వైద్య సేవలందించే లద్నూర్ పీహెచ్‌సీలో మరమ్మతులకు కేసీఆర్ సర్కార్ రూ. 23లక్షల నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేండ్ల క్రితం కొంత ఇసుకను డంప్‌చేసి పనులు చేపట్టకుండా చేతులు ఎత్తేశా డు. నాటి నుంచి పీహెచ్‌సీ వైపు ఆయన కన్నెత్తి చూడడం లేదు. పీహెచ్‌సీలో సిబ్బంది క్వార్టర్స్‌తో పాటు ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్, ఫ్లోరింగ్, డ్రైనేజీ సమస్యలు, వసతులు సరిగా లేక వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళ క్వార్టర్స్‌లో ఉండేందుకు వైద్య సిబ్బంది జంకుతున్నారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంతో వైద్యాధికారి సుధీర్ రాజ్ రెండుసార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీ మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు, రోగులు కోరుతున్నారు.

ఎంఈవోలు కావలెను..!

- 21 మండలాలకు ముగ్గురు ఎంఈవోలే దిక్కు
- ఒక ఎంఈవోకు 12 మండలాలు, మరో ఎంఈవోకు ఏడు మండలాల బాధ్యతలు
- కరువైన పర్యవేక్షణ
- అంతంత్రమాత్రంగానే ఆంగ్ల మాధ్యమం అమలు
- నాణ్యమైన విద్య అందక నష్టపోతున్న విద్యార్థులు

మెదక్, జూలై 7 (నమస్తే తెలంగాణ) : కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో విద్యను అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెబుతున్నది. కానీ, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై బడులు కొనసాగుతున్నాయి. కానీ, మౌలిక వసతుల లేమి, సరిపడా ఉపాధ్యాయులు లేక సర్కారు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. కనీసం మండల విద్యాశాఖ అధికారులను నియమించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాల పునర్విభజన అనంతరం మెదక్ జిల్లాలో ఒక్కరూ కూడా పూర్తిస్థాయి ఎంఈవో లేకపోవడం గమనార్హం. మెదక్ జిల్లాలో మొత్తం 871 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 607, ఉన్నత పాఠశాలలు 124, జడ్పీహెచ్ఎస్‌లు 140 ఉన్నాయి. వీటితో పాటు గురుకుల పాఠశాలలు 2, కేజీబీవీలు 15, ప్రైవేట్ పాఠశాలలు 118 ఉన్నాయి.

ఒకరికీ ఏడు మండలాలు..

ఎంఈవోగా మండలానికి ఒకరు ఉండాలి. కానీ, ఏ ఒక్క మండలానికి నేటికీ పూర్తిస్థాయి మండల విద్యాధికారి లేకపోవడం గమనార్హం. మెదక్ జిల్లాలో 21 మండలాలు ఉండగా.. సీనియర్ హెచ్ఎంలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వారికి కూడా అదనంగా ఒకరికి ఏడు మండలాలు అప్పగించారు. వారు రెగ్యులర్ హెచ్ఎం బాధ్యతలు నిర్వర్తిస్తూనే అదనంగా ఎంఈవో విధులు నిర్వర్తిస్తున్నారు. మెదక్ ఎంఈవోగా పనిచేస్తున్న నీలకంఠంకు మెదక్, పాపన్నపేట, హవేళీఘనపూర్, కొల్చారం, టేక్మాల్, రామాయంపేట, నిజాంపేట బాధ్యతలు అప్పగించారు. చిన్నశంకరంపేట ఎంఈవో బుచ్యా నాయక్‌కు నర్సాపూర్, శివ్వంపేట్, కౌడిపల్లి, చిన్నశంకరంపేట, చేగుంట, తూప్రాన్, మనోహరాబాద్, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్, నార్సింగి, చేగుంట మండలాల బాధ్యతలు చూస్తున్నారు. వెల్దుర్తి ఎంఈవో యాదగిరికి వెల్దుర్తి, మాసాయిపేట మండలాలు చూస్తున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సైతం సెక్టోరియల్ అధికారుల పరిస్థితి అలాగే ఉంది. సెక్టోరియల్ అధికారులను అదనపు బాధ్యతల నిమిత్తం సీనియర్ హెచ్ఎంలను నియమించారు. ప్రభుత్వం విద్యాశాఖపై దృష్టిసారించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి సర్కారు విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కరువైన పర్యవేక్షణ

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియంలోనే బోధన చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైతం ఇంగ్లిష్ బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. క్షేత్రస్థాయిలో ఎంఈవోలు లేకపోవడంతో పర్యవేక్షణ కరువైంది.రెగ్యులర్ ఎంఈవోలు లేక ఉపాధ్యాయులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారింది.

కోర్టు పరిధిలో ఉంది..

మెదక్ జిల్లాలో 15 ఎంఈవో పోస్టులు భర్తీ చేయాల్సి ఉం ది. సర్వీస్ రూల్స్ అడ్డంకిగా మారాయి. ఈ సమస్య ఇప్పుడు కోర్టు పరిధిలో ఉంది. గతంలో ఎంఈవోలుగా ఉన్న వారితోనే కొనసాగిస్తున్నాం. ఒక్కో ఎంఈవోకు ఏడు నుంచి 12 మండలాల బాధ్యతలను అప్పగించాం.

-రాధాకిషన్, డీఈవో మెదక్